క్లుప్తంగా

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన నాయకులు



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పట్టణానికి చెందిన యువనాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ నియోజకవర్గం అభివృద్ధితోపాటు యువతకు మంచి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, పంజాల అరవింద్, ఎన్‌ఎస్‌యూఐ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని హనుమానుప్రసాద్, కమలాపూర్ ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బొంకూరి కుమార్‌యాదవ్ నాయకులు ఉన్నారు.

మంత్రి పొన్నంకు మున్నూరుకాపుల వినతి



వినతిపత్రం ఇస్తున్న మున్నూరుకాపులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. ఆదివారం హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి కొన్నేళ్లుగా భవనంలేక ఇబ్బంది పడుతున్నామని విన్నవించారు. అనంతరం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చింతపూల వెంకటయ్య, నాయకులు కాసార్ల మహేందర్, కంది శంకర్, ఆవుల తిరుపతి, తోట వెంకటయ్య, కానవేని యాదయ్య పలువురు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

జమ్మికుంట: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని జనతదల్ (సెక్యూలర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. పట్టణంలోని అయ్యప్ప టెంపుల్, మారుతినగర్ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో స్థలం తీసుకొని ఇళ్లు కట్టుకున్నవారు ప్రభుత్వాన్ని, అధికారులను తప్పదోవ పట్టించే విధంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదని, అర్హులకే ఇళ్లు అందే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూంరెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

చిగురుమామిడి: జనరల్ సర్జన్‌గా పేరొందిన కరీంనగర్ ప్రముఖ డాక్టర్ వొంటేరు భూంరెడ్డి మరణం తీరనిలోటని ఆయన వైద్యసేవలు మరువలేనివని రెడ్డి ఐక్యవేదిక సంఘం నాయకులు అన్నారు. ఆదివారం చిగురుమామిడిలో రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో భూంరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెడ్డి ఐక్యవేదిక సంఘం నాయకులు మాట్లాడుతూ... దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు వైద్యసేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక సంఘం మండల అధ్యక్షుడు కాటం సంపత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతాల మహిపాల్‌రెడ్డి, నాయకులు వంటకాల సంపత్‌రెడ్డి, రాజురెడ్డి, జంగ రాజిరెడ్డి, పూల లచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాగెల్లి రాజిరెడ్డి, నల్లాల మధూసూధన్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రేకొండ మాజీ ఎంపీటీసీ చాడ శోభ కుటుంబ సభ్యులను రెడ్డి సంఘం నాయకులు పరామర్శించారు.

ముగిసిన చెస్ శిక్షణ శిబిరం

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో నిర్వహించిన చెస్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. శిబిరంలో సుమారు 100 మందికి పైగా చిన్నారులు హాజరై చెస్ క్రీడలో మెలకువలు నేర్చుకున్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో హాజరైన చిన్నారులకు సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ప్రైవేట్ పీఈటీల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కనుకయ్య పాల్గొన్నారు.

అవగాహన అంతంతే..!

- తడి, పొడిచెత్త వేరుచేయకుండానే చెత్తబండిలో వేస్తున్న పట్టణ ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు
- డంపింగ్‌యార్డులో టన్నులకొద్దీ పేరుకుపోతున్న చెత్త



హుజూరాబాద్: పట్టణ ప్రజలు ఇంట్లోని చెత్తా చెదారం ఒకే డబ్బాలో వేసి స్వచ్ఛ ఆటోలకు ఇస్తున్నారు. దీంతో తడి, పొడిచెత్తగే డంపింగ్‌యార్డులో టన్నులకొద్ది పేరుకుపోతోంది. చెత్త ఉత్పత్తిని తగ్గించడం.. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంపై ప్రజలకు అవగాహన కల్పించినా మార్పు రాకపోవడంతో వందరోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనుల నిర్వహణపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై కూడా సరైన అవగాహన కల్పించకపోవడం అధికారుల లోపంగా కనిపిస్తుంది. ప్రతి వార్డులో అవగాహన కార్యక్రమాలను నిర్వహించకుండా కేవలం కాగితాలకే పరిమితం చేశారు. చెత్తను ఒకే డబ్బాలో వేయకుండా చర్యలు తీసుకోనున్నారు. తడి చెత్తతో ఎరువు తయారీ చేసుకోవచ్చని అధికారులు చెప్పుతున్నప్పటికీ దీన్ని సక్రమంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారు. పొడిచెత్తను రీసైక్లింగ్ చేసుకోవచ్చు కానీ ప్రక్రియ తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కొంతమంది ఇంటి యాజమానులు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తుండగా మరికొంత మంది వేరు చేయకుండానే ఇస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తను ఒకే దగ్గర కుమ్మరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. తడిచెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేయకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతుంది. తడిచెత్త ఆకుపచ్చ, పొడిచెత్త నీలిరంగు డబ్బాలో వేసి ఇంటికి వచ్చే ఆటో, ట్రాక్టర్లకు అందించాలి, కార్మికులు కూడా అలా చేసి ఇస్తేనే తీసుకోవాలి, ఆటో, ట్రాక్టర్లలో తడి, పొడిచెత్త వేర్వేరుగా తీసుకెళ్లే ఏర్పాట్లతోపాటు వేరు చేసే విధానంపై ఇంటింటా ప్రచారం చేయాలని పలువురు అంటున్నారు.



పట్టణంలో పారిశుధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తడి, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలి



మున్సిపాలిటీలో పొడి, పొడిచెత్త వేరు చేసే విధానంపై త్వరలో స్పెషల్ డ్రైవ్ ద్వారా పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అదే విధంగా చెత్త సేకరించే వాహనదారులు, కార్మికులకు సైతం ప్రజలకు తెలియజేయాలని సూచిస్తున్నాం. ప్రజలు వార్డుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటివద్దకు వచ్చే వాహనాలకు తడి, పొడిచెత్త వేరు చేసి ఇవ్వాలి.

– సమ్మయ్య, కమిషనర్, హుజూరాబాద్



రామడుగులో మాట్లాడుతున్న ఓదెలు



గంగాధరలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

వికసిత్ భారత్ సంకల్ప సభ

రామడుగు: మండల కేంద్రంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప సభ బీజేపీ రామడుగు మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నబోయిన ఓదెలు పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందని, వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు ఉప్పు రాంకిషన్, బండ తిరుపతిరెడ్డి, పోచంపల్లి నరేష్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, వేముండ్ల కుమార్, గుంట ఆశోక్, జిట్టవేని అంజిబాబు, కట్ట రవీందర్, రాం, లక్ష్మణ్ పలువురు పాల్గొన్నారు.

గంగాధర: మండల కేంద్రంలో బీజేపీ గంగాధర మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్‌గౌడ్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించగా ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. పదకొండేళ్ల మోదీ పాలనను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, నాయకులు కోల అశోక్, తూం నారాయణ, మల్యాల వినయ్‌సాగర్, సుభాష్ చంద్రశేఖర్, తాళ్ల రాజశేఖర్, ఆకుల మనోహర్, అనిల్, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

‘యంత్రలక్ష్మి’ కరుణ ఎప్పుడో..?

- సబ్సిడీ యంత్రాలు అందక రైతుల తిప్పలు
- నిధుల కొరతతో పంపిణీలో జాప్యం

కరీంనగర్‌రూరల్: రైతులకు ఆర్థికంగా తోడ్పాటునందించడంతో పాటు సాగుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేస్తోంది. అయితే 2017 సంవత్సరం నుంచి ప్రభుత్వం సబ్సిడీ యంత్రాలు, పరికరాల పంపిణీని నిలిపివేసింది. సబ్సిడీ యంత్రాల, పరికరాలతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరం మార్చిలో జిల్లాకు మొత్తం 331 సబ్సిడీ యూనిట్లు మంజూరు కాగా కరీంనగర్ మండలానికి 24 యూనిట్లు కేటాయించారు. కొంతమంది రైతులు దరఖాస్తు చేసుకోగా అధికారులు యూనిట్లను రద్దు చేశారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సబ్సిడీపై యంత్ర యూనిట్లను మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఏడేళ్లుగా నిరీక్షణ

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యంత్రలక్ష్మి పథకంలో భాగంగా 33శాతం నుంచి 50శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు, రోటవేటర్, మక్కలు పట్టే యంత్రం, పవర్‌స్ప్రేలు, హార్వెస్టర్లు, టార్పాలిన్లు పంపిణీ చేసింది. అనంతరం 2016–17నుంచి వీటి పంపిణీని నిలిపివేయడంతో రైతులు యంత్రాలను కొనలేక కూలీలను ఆశ్రయిస్తున్నారు. యంత్రాలను వినియోగించడంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే అవకాశముంది. సాగు ఖర్చులు సైతం తగ్గుతాయి. ప్రస్తుతం రైతులు కిరాయిపై యంత్రాలను తీసుకొచ్చి వ్యవసాయ పనులను పూర్తి చేసుకుంటున్నారు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

బడ్జెట్ మంజూరు లేదు

ప్రభుత్వం సబ్సిడీ యంత్రాల కోసం ప్రస్తుతం బడ్జెట్ మంజూరు చేయలేదు. మార్చిలో మహిళా రైతులకు మంజూరు చేసిన యూనిట్లను రద్దు చేశాం.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

మోసం చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్: ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా సీబీఎస్‌ఈ, ఐఐటీ, నీట్, ఈటెక్నో, ఒలింపియాడ్, ఐపీఎల్ అని తోక పేర్లతో అమాయక విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలోజరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాధికారి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.


లంబాడిపల్లి రెడ్డి సంఘం కార్యవర్గం



ఎన్నికైన రెడ్డి సంఘం నాయకులు

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా పింగిలి సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా హనుమాండ్ల కనకారెడ్డి, నల్లాల రాజిరెడ్డి, కార్యదర్శిగా కాటం రత్నాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నాగెల్లి రాజిరెడ్డి, డైరెక్టర్లుగా శ్యామకూర సంపత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమం రెడ్డి ఐక్యవేదిక సంఘం మండల అధ్యక్షుడు కాటం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సంది రాజిరెడ్డి పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శాలువాలతో సన్మానించారు.

మసీద్ కమిటీ..



ఎన్నికైన అధ్యక్షుడు, కమిటీ సభ్యులు

జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లి గ్రామంలోని మసీద్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడిగా రజాక్, సెక్రెటరీగా మహమూద్, జనరల్ సెక్రటరీగా సాదిక్, కోశాధికారిగా రెహమాన్‌ను సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యాకూబ్, అజ్మీర్, అల్లావుద్దీన్, జాఫర్, చాంద్‌పాషా, రియాజ్, నబిసాబ్, అజీజ్ పాల్గొన్నారు.

శాలివాహన సంఘం..

మానకొండూర్: మానకొండూర్ శాలివాహన కుల సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వేణువంక రాజయ్య, ఉపాధ్యక్షుడిగా రాధారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి సాయి కుమార్, ఉప ప్రధాన కార్యదర్శిగా సిలివేరు సంతోష్ కుమార్, కోశాధికారులుగా వేణువంక వెంకన్న, రాజమౌళి, కార్యవర్గ సభ్యులుగా వీరస్వామి, రాజయ్య, రాజు, శంకరయ్య, తిరుపతి, సలహాదారులుగా రామయ్య, సురేస్, ఐలయ్య, ఎన్నికయ్యారు.



హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వెనక, ఇతర ప్రదేశాల్లో ప్రధాన రోడ్డుపై కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయిస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్ సెల్ నం : 70326 51516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు

హుజూరాబాద్: ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంఘం నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం గౌస్కుల ముత్యంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ...కార్మికులకు వివధ బకాయిలు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. కొందరు పెన్షన్ తీసుకోకుండానే చనిపోతున్నారని, అనారోగ్యానికి గురైన కార్మికులకు తక్షణం వైద్యం అందించాలని ఆర్టీసీ తార్నాక ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు రంగు పండరి, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, వెంకట్రాం, నరసయ్య, రావుల రఘుపతి, బత్తిని సంజీవ్, నారాయణ తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం

వీణవంక: మండలంలోని మామిడిలపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి వైద్యులు వివిధ పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడారు. మామిడాలపల్లి గ్రామ ప్రజలకి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామని, ఆసుపత్రిలో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.వైద్య శిబిరంలో రెడ్డి సంఘ నాయకులు, సురేందర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, వెంకట పాపయ్య, లచ్చయ్య, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, శ్రీకాంత్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతునేస్తం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, కాచాపూర్, మెట్‌పల్లి రైతువేదికల్లో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు రైతునేస్తం కార్యక్రమం ఉంటుందని ఏవో వెంకటేశ్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని, రైతులు పాల్గొనాలని కోరారు.

సామాజిక సేవతో సంతృప్తి

చొప్పదండి: సామాజిక సేవతో సంతృప్తి లభిస్తుందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ఆధ్వర్యంలో చొప్పదండి లయన్స్ భవన్‌ను ముఖ్య అతిథిలుగా హన్మాండ్ల రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు హాజరై ప్రారంభించారు. పర్మనెంట్ ప్రాజెక్టులో భాగంగా దాతల సహకారంతో లయన్స్ భవన్ మొదటి అంతస్తు ప్రారంభించడం అభినందనీయమని, అలాగే మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ జిల్లాలోనే చొప్పదండి లయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలిచిందన్నారు. విశిష్ట అతిథులు మొదటి ఉపగవర్నర్ కోదండరాం, రెండో ఉపగవర్నర్ మోర భద్రేశం, జిల్లా అడిషనల్ సెక్రటరీ జయ ప్రకాష్‌చౌడా, జీఈటీ నరేష్, చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్స్ భవన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కేసు నమోదు

జమ్మికుంట: భూ వివాదంలో మహిళపై దాడి చేసిన ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన బిజిగిరి లక్ష్మి, బాలయ్య భూమి విషయంలో కోడలు బిజిగిరి లక్ష్మిపై కర్రతో దాడి చేయగా ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని వివరించారు.

ముగ్గుల పోటీలు



బహుమతి అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ పటేల్ మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వినూత్న తరహాలో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన మంజుల, రజిత, వాణిలకు బహుమతులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు యా దగిరి, ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి భూమయ్య, సలహాదారుడు సు ధాకర్, తిరుపతి, మల్లయ్య, కపిల్ మాధవ, తిరుపతి, ఆంజనేయులు, హన్మంతు, ప్రకాశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ ముస్లిం విద్యావంతుల వేదిక నాయకులు ఆదివారం ధర్మపురిలో రాష్ట్ర సామాజిక అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ముస్లిం విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి రియాజ్ అలీ రిజ్వి. ఎస్‌ఏ. మొహిసిన్, సయ్యద్ హబీబుద్దీన్ హాజీ, అహ్మద్ అలీ, సయ్యద్ ముజ్తాబా హుస్సేన్, షఫిక్ అహ్మద్ అథర్ తదితరులున్నారు.

20 లోపు ‘రైతు భరోసా’కు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: రైతు భరోసా కింద ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ తెలిపారు. 2025–26 వానాకాలం పంటకు సంబంధించి ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా డబ్బులు డీబీటీ పద్ధతి ద్వారా పట్టాదారు రైతు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే భూభారతి వెబ్‌సైట్‌లో ఈనెల 5వ తేదీ వరకు భూమి పట్టా కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేయబడతాయని తెలిపారు. నూతన భూమి పట్టాదారులు, గత పంట కాలాల్లో డీబీటీ విఫలమై ఖాతాల్లో డబ్బులు పడని రైతులు, అలాగే గతంలో పట్టా ఉండి ఇంతవరకు కూడా బ్యాంకు ఖాతాలో, రైతు భరోసాలో రిజిస్టర్ చేసుకొని రైతులు ప్రస్తుతం తమ పట్టాదారు పాసుబుక్ కాపీతో పాటు బ్యాంకు ఖాతా పాసు బుక్ మొదటి పేజీ, క్యాన్సిల్ అయిన చెక్ యొక్క పేజీని సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందజేసి రైతు భరోసాలో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. తద్వారా రైతుభరోసా స్కీం ద్వారా లబ్ధి పొందవచ్చునన్నారు.



శంకరపట్నం: కేశవపట్నం 1988-89 పదో తరగతి విద్యార్థులు



చిగురుమామిడి: నవాబుపేట1999-2000 పదో తరగతి విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

శంకరపట్నం/చిగురుమామిడి: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ పాఠశాల 1988–89, చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట జిల్లాపరిషత్ పాఠశాల 1999–2000 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆయా పాఠశాలల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాతా అందరూ ఒకచోట చేరిన అనంతరం రాజకీయ, వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ ఇతర రంగాల్లో స్థిరపడినవారు బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. అనంతరం చదువు చెప్పిన టీచర్లను ఘనంగా సన్మానించారు.